కథ



# కలలల టీవీ పెట్టె

- గన్ను కృష్ణమూర్తి

(గత సంచిక తరువాయి)

యెంకులు దగ్గర టీవీ ఉన్నదన్న వార్త గూడెం గూడెం పాకింది. మరునాడు బిలబిలమంటూ పోరలంతా వచ్చి చేరారు "టీవీ పెట్టమంటూ"!

"తలా రూపాయిత్తే గానీ, చూన్నిచ్చేది లేదు!" కండిషన్ పెట్టాడు కొండడు, యెంకులు రెండో కొడుకు.

"అన్నాలం! అన్నాలం!" అంటూ గోల చేశారంతా.

చివరికి పావలా రేటు ఖాయమైపోయింది. తలా పావలా యిచ్చి, టీవీ షోకి ఎగబడ్డారు వాళ్లు. ఆ పావలా కూడా లేని పోరలు ఎనక్కి వెళ్లిపోయారు.

"పావలా యిస్తే టీవీ షో! ఎన్నిగంటలైనా చూడొచ్చు! చీపంటే చీప్!" అనుకున్నారు వాళ్లు.

మొత్తాని కా రోజు ఐదు రూపాయల కలెక్షన్ కళ్లజూశాడు యెంకులు.

✻ ✻ ✻

మర్నాడు మళ్లీ షో ప్రాంరంభమైంది. ఈ రోజు కలెక్షన్ పది. యెంకులు మీసాలు మెలేశాడు.

సినిమా మంచి సీక్వెన్స్‌లో ఉన్నప్పుడు, పానకంలో పుడకలాగా వచ్చాడో కాన్నుబుల్ పట్టపగలే చుక్కేసుకుని!

"అబే! గీడ ఏం జేస్తాండ్లురా మీరంతా?....ఏందీ గోల?" అంటూ వచ్చీ రాగానే, లాటీకి పనిజెప్పాడు. పోరలంతా గొల్లుమన్నారు. పందులు అటూ, యిటూ పరుగెత్తాయి! కుక్కలు" భౌ! భౌ!"మంటూ అరవసాగాయి.

యెంకులు రంగప్రవేశం చేసి, తన కథనంతా చెప్పాడు ఎట్లా తాను వెళ్లిందీ, ఎట్లా వాళ్ళు వచ్చిందీ ఎట్లా టీవీ యిచ్చి వెళ్లిందీను. ఒక్క అక్షరమ్ముక్క తప్పకుండా ఎక్కడా పొల్లు పోకుండా! ఆపై చేతులు కట్టుకునుంచున్నాడు బుద్ధిగా!

"ఐతే, ఆళ్ళు టీవీ యిస్తే, నువ్వు దీసుకుంటే మరి కరెంటె వ్వడియ్యాలె? పున్యాని కొస్తదా?..వైర్లు గట్టీ, కట్టిబెట్టీ, కరెంటు లూటీ చేసినడ్పుతవ్... సినిమా షో బెడ్తవు?...అవునా?"... అంటూ యెంకుల్ని ప్రక్కకి నెట్టి పోరల్ని ఒక్క తన్ను దన్ని వైర్లూడబీకి టీవీ పెట్టెను సంకల బెట్టిండు. 'ఎబౌట్ టర్న్' అంటూ, వెళ్ళిపోసాగాడు. రాముని వెంట రామదండులా యెంకులూ, పోరలూ పడ్డారు. కాళ్ళా, వ్రేళ్ళా పడినా వినేట్టు లేడు. తన టీవీ షో కలెక్షన్ పదిహేనుకి మరో పదిహూఏను జతచేసి చేతుల్లో బెట్టి, కాళ్ళట్టుకున్నాడు

అప్పుడా కానిస్టేబుల్ గారు కరిగిపోయి, "సర్లే! తీసుకెళ్ళు పాపం! కనిన్యూసిసన్స్ చెయ్యకు"! అంటూ యెంకులు పెట్టెను యెంకులుకి భద్రంగా అప్పగించాడు

అక్కడికే మురిసిపోయారు వాళ్ళు, తమ కలల పెట్టె తమకు మళ్ళీ దక్కినందుకు.

✻ ✻ ✻

తెల్లారాక మళ్ళీ టీవీ షో మొదలైంది. పోలీసులు రాలేదు కాని అకాలవర్షం వచ్చింది. దబ్బ దబ్బ వైర్లూడబీకి, చెట్టుమీదికి చేర్చారు టీవీని. ఒంటి మీని గుడ్డలూడదీసి టీవీ పైన కప్పివేశారు తడవకుండా! కొన్ని ప్లాస్టిక్ కాగితాలూ కప్పారు. మళ్ళీ పైవుల్లో పెట్టడానికి వాళ్ళకి ధైర్యం చాలలేదు, మళ్ళీ పందులేం చేస్తాయో నన్న భయం వాళ్ళకి.

కుండపోతవర్షంలో పోషిరలు తడిశారు కానీ టీవీని తడవనీయలేదు. వర్షం వెలిశాక భద్రంగా చెట్టుమించి టీవీని దింపారు. జమ్మిచెట్టు మీంచి పాండవులు తమ అస్త్రశస్త్రాలని దింపుకున్నట్లు!

ఎన్ని గుడ్డల్ని చుట్టినా, ఎన్నిప్లాస్టిక్ కాగితాల్ని కప్పినా, టీవీ తడవనే తడిసింది. యెంకులు తల పట్టుకుక్కూచున్నాడు. పోరలు దాన్ని మళ్ళీ సుబ్బరంగా తుడిచారు. వెచ్చగా ఉంటుందని కాసే పు పొయ్యి కాడెట్టారు. సాయంత్రానికి మబ్బులు వెలిసి, వాతా వరనం బాగయ్యాక, టీవీని పొయ్యి కాంచి ఓ చెట్టు క్రిందికి చేర్చారు. అది మసిబారి మసిపాతపేగయిపోయింది. ఎంత తుడి చినా ఎంత శుబ్బరం చేసినా, దాని పూర్వపు అందచందాలు తిరిగి రానేలేదు.

దిగులు మొహాలతో దాని చుట్టూ చేరి, అతి కష్టమ్మీద దాన్ని మళ్ళీ పలికించారు. అప్పుడు మాయల పకీరు సినిమా

బాలనాగమ్మ వస్తోంది. చాలా సీరియస్‌గా చూస్తున్నారు పోరలు. బాలవర్ధిరాజు కాకులు దూరని కారడవి లోంచి, కాలి నడకన వెళ్ళి, ఓ చెట్టుతొర్రలో దూరి అగ్నిగుండంలోకి దూకి, పాతాళ బిలం చేరుకున్నాడు. అక్కడన్నీ పాములే పాములు! పడగలు విప్పి బుసలుకొడుతున్నాయి! ఎంతో ఉత్కంఠతో చూస్తున్నారు పోరలు. ఇంతలో ఓ కుర్రాడు "పాముర! పాము!" అంటూ లేచి అరిచాడు.

"అరేయ్! పిచ్చోడా! టీవీల పాముకే అరుస్తావేందిరా?" అంటూ మరొక కుర్రాడు వాని కూర్చోబెట్టాడు.

"కాదురా!...నిజంగ పామే!... టీవీ పెట్టెల ఉందిరా!" అంటూ మళ్ళీ లేచి, గంతులేయసాగాడు.

పరీక్షగా చూశారంతా!... నిజమే!... టీవీపెట్టె సందులోంచి ఓ పాము పిల్ల తలకాయ బయటపెట్టింది!... ఎప్పుడు దూరిందో ఏమో!

అందరూ దూరం జరిగి నుంచున్నారు. అది మెల్లిగా పెట్టెలోంచి బయటపడింది. దాన్ని కాస్త దూరం రానిచ్చి, కర్రల్తో, రాళ్ళతో బాది దాన్ని చంపేశారు వీరాభిమన్యుల్లా!

ఆ సంగతి తెలిసి, గూడెం గూడెం అక్కడికి చేరింది. సినిమా చూసినట్లుగా దాన్ని విచిత్రంగా చూసి, చివరికి దానినోట్లో కాసెట్టి దహనం చేసి, ఎవరిళ్ళకు వాళ్ళు చేరుకుని తలంటు స్నానాలు చేశారు.

***

చూస్తుండగానే ఆర్నెల్లు గడిచాయి. ఈ ఆర్నెల్లలో అనేక అద్భుతాలు జరిగి పోయాయి.

గాలివానలూ, వడగళ్ళవానలూ, వచ్చి వెళ్ళాయి. అనేక మార్లు టీవీ చెట్టె క్కింది, దిగింది. పైపుల్లోనూ దూరింది. ఓ సారి తస్కరణకూ గురయింది. నానా తంటాలు పడి, గుడిసెలన్నీ వెదకి, దొంగని పట్టుకున్నారు. టీవీని తెచ్చుకున్నారు. ఒకటి, రెండు మార్లు కరెంటు డిపార్ట్ మెంటు వాళ్ళు వచ్చి హెచ్చరించి పోయారు. ఓ సారి పెద్దాడికి కరెంటు షాకు తగిలి, ఆసుపత్రిపాలయ్యాడు. ఈ తంటాలు భరించలేక పోరల సాయంతో ఓ గడ్డి గుడిసేసుకుని, ఓ యింటి వాడయ్యాడు యెంకులు. పోరలకు టీవీ మోజు తగ్గలేదు కానీ, టీవీ నాలెడ్జి మాత్రం పెరిగింది.

***

ఓ రోజు టీవీ షో నడుస్తోంది. తలా పావలా వసూలు చేసి, టీవీషో నడిపిస్తున్నాడు లచ్చులు- యెంకులు ఏడో కొడుకు.

ఓ పిల్లాడు మాత్రం ఇవ్వలేదు. పావలా తీసుకురమ్మని వాన్ని కెనక్కి పంపించేశారు. వాడు ఏడుస్తూ, ఏడుస్తూ కొంత దూరం వెళ్ళి, రాళ్ళు విసిరాడు. ఓ రాయి లచ్చులుకి తగిల్తే, ఓ రాయి టీవీకి తగిలింది. దాంతో వీళ్ళూ రాళ్ళు రువ్వారు ఆ పిల్లాడికి తగిలిందో రాయి. వాడేడుస్తూ వెళ్ళి వాళ్ళ వాళ్ళకి చెప్పాడు. ఇంకేముంది? ఆ పిల్లాడితాలూకు పెద్దలూ, పిన్నలూ చేరారు. రాళ్ళు రువ్వుకున్నారు. కాసేపు రాళ్ళ వర్షం కురిసింది.

రువ్వీ, రువ్వీ అలసిపోయాక, రక్తమోడుతూ ఆస్పత్రికెళ్ళారు. కట్లుకట్టించుకుని అట్నుండి అటే పోలీసు స్టేషన్‌కెళ్ళారు.

అందరికీ నాలుగు వడ్డించి, పెద్దలందరినీ తరిమేసి, పోరలందర్నీ లాకప్పులో పడేశాడు యస్సై.

పోలీస్టేషన్‌లో పోరలు, బయట తల్లిదండ్రులు.

"జానెడింట్లో మూరెడు కట్టె" లాగా, ఆ యిరుకైన సెల్లులో గొర్రెల్ని తోలినట్లు తోలాడు యస్సై. అడవిలో తిరిగే పక్షుల్ని పంజరంలో బంధించినట్లయింది వాళ్ళకి. కూచోడానికిక్కాడు. నిల్చోడానికే స్థలం లేదు వాళ్ళకి ఉక్రోషం ముంచుకొచ్చింది.

"పోలీసు జులుం నశించాలి!" అంటూ నినాదాలు చేశారు, అచ్చం సినిమాల్లో చేసినట్లుగానే! టీవీలో చూపినట్లుగానే హెడ్ కానిస్టేబుల్ ఊచల సందుల్లోంచి లాటీ దూర్చి తలా వకటి వడ్డించాడు. అంతా మౌనం వహించారు. ఏం చెయ్యాలో తోచలేదు వాళ్ళకి. లోన సద్దు మణిగిందో, లేదో బయట అల్లరి మొదలయింది.

యస్సై, హెడ్డూ ఇద్దరూవెళ్ళి, బయటివాళ్ళని దూరంగా తరిమేసి, రొప్పుతూ, రొజుతూ వచ్చి కూలబడ్డారు. పావుగంటైనా గడిచిందో లేదో, ఓ పోరడు సైగచేసి పిలిచాడు హెడ్డుని. హెడ్డు అనిష్టంగానే లేచి వెళ్ళాడు.

"ఏందిరా?" అడిగిండు.

"నా తాన రూపాయి చారాన ఉన్నది. ఇస్త, ఇడ్చి పెడ్తవా?" అన్నాడు.

"చుప్ బే చుప్!...నీ చారానకు బారానకు ఆశపడ్తననుకున్నావురా?" "మరెంత యియ్యమంటరు సార్?.... మా అయ్యతాన శాన పైసలుండయ్" అన్నాడు మరొకడు. "నిజమార?" "అవుసార్! మా అయ్య మస్తుగ మిత్తీల కిస్తడు!...నీగ్గావాలంటె యిప్పిస్త!" అన్నాడు వాడు. "ఏంజేస్తడ్రా మీ అయ్య?""ఇంకేంజేస్తడు?... అడుక్కతింటడు!"

"నా తాన చారాన ఉన్నది" అన్నాడుమరొకడు

హెడ్డు గుడ్లు తేలేశాడు.

ఎస్సై పగలబడి నవ్వసాగాడు.

"చూసినావురా? మనసంగతి పోరలక్కాడ తెల్సి పోయింది. పైసలిస్తే ఇడ్చి పెడ్తరని!"

"చుప్ బే చుప్! నీ చారానకు బారానకు ఆశపడ్త ననుకున్నావురా?"

"మరెంత యియ్యమంటరు సార్?.... మా అయ్య తాన శాన పైసలుండయ్" అన్నాడు మరొకడు.

"నిజమార?"

"అవు సార్! మా అయ్య మస్తుగ మిత్తీల' కిస్తడు! నీగ్గావాలంటె యిప్పిస్త!" అన్నాడు వాడు.

"ఏం జేస్తడ్రా మీ అయ్య?"

"ఇంకేం జేస్తడు? అడుక్కతింటడు!"

"ఐతే అడుక్క తినెటోండ్గగర అడుక్కతినమంటావురా నన్ను?"

"ఇయ్యా రేపట్ల అడుక్కతిన నోడెవ్వడు సార్! కింది నుంచి మీదిదాక గదేనాయె!" నవ్విండొకడు.

హెడ్డుకు చక్కరొచ్చినట్లయింది. గోడకు కూలబడ్డడు.

"అబే! గా పోరగాడ్లతోని ఏం మాటల్ బెట్టినవ్? ఊర్కో!" మంటూ కోపగించాడు ఎస్సై. కానిస్టేబుల్లు ముసి ముసి నవ్వులు నవ్వుకోసాగారు.

ఇలా లాభం లేదనుకొని ఏకంగా ఎస్సైనే పిలువసాగారు పోరలు. ఎస్సై లేచివెళ్ళాడు సెల్ దగ్గరకు.

దగ్గరికి పిలిచి, చెవిలో గుసగుసలాడిం డొకడు. "మాంచి పొల్లుంది సార్! కావాల్నా?..."అంటూ.

ఈ సారి ఎస్సైవంతయింది. కళ్ళు తిరిగి కూలబడ్డాడు.

హెడ్డూ, కానిస్టబుల్స్, పరుగెత్తుకొచ్చి, లేవదీశారు. ఆయన్ని ఆయన సీట్లో కూర్చోబెట్టి, మొహాన నీళ్ళు చిలకరించారు. ఓ అరగంటకి తేరుకొని, మనిషయ్యాడాయన.

పోరలు ఊర్కోవడం లేదు. ఎలాగైనా బయటపడాలన్నదే వాళ్ళ తపన. "సార్! సార్!" అంటూ ఒకడు చిటికెన వ్రేలు చూపిస్తే, మరొకడు రెండువ్రేళ్ళు చూపించాడు.

"మిమ్మల్ని ఎక్కడికి విడిచిపెట్టేది లేదు. అరిస్తే చంపుత!" బెదిరించాడు హెడ్డు.


"ఇంతకూ మమ్మల్ని ఎందుకు బట్టుకున్నట్టు సార్? మేం దొంగతనం జేస్తిమా? లూటీలు జేస్తిమా? రేప్ జేస్తిమా?" అడిగాడో పోరడు.

"వామ్మో!...మీకు రేపుల సంగతి గూడ తెల్సునారా?"

"నాగ్గూడ దెల్సు!" నంటూ చెయ్యి లేపాడు ఓ మూడేళ్ళ పోరడు గోచీ సవరించుకుంటూ.

"మీ టీవీ లాలెడ్జి బాగానే పెరిగిందిరో!" నోరు తెరిచాడు హెడ్డు.

"అవు మల్ల! ఇరవై నాలుగ్గంటలు మాకదేనాయె! పోలీసులకతలు! రేపుల కతలు! నాయకులు కతలు! కాలేజీ పోరగాండ్ల కతలు! అన్నీ జూసినమ్! అంతా సమజయింది మాకు!" అన్నాడింకొకడు.



"వామ్మో!...ఈ టీవీల పంపిణీ మా కొంపముంచెటట్లున్నది గదా?" బాధపడ్డాడు హెడ్డు.

"మీకో టీవీ యిప్పించమంటారా సార్?" అందుకున్నాడు మరొకడు.

"నువ్వు, నాకు, యిప్పిస్తావురా?" నోరు తెరిచాడు హెడ్డు.

"అవు సార్! నాకు మస్తుమంది తెల్సు! నేను సుత ఎలెచ్చన్లల్ల పచారం జేసిన!"

"దేనికిరా?"

"అన్ని పార్టీలకు!" అన్నాడు వాడు.

అలా వాడన్నాడో లేదో, "కాంగిరేస్ జిందాబాద్" అని కొందరు. "టిడిపి జిందాబాద్" అని కొందరు, "టిఆరెస్ జిందాబాద్" అంటూ మరి కొందరు నినాదాలు చేశారు. పోలీస్ స్టేషన్ వాళ్ళ అరుపుల్తో మార్మోగింది.

హెడ్డు నోరు చేసుకోవడంతో కాసేపు మౌనంగా ఉండిపోయారు వాళ్ళు.

మళ్ళీ కాసేపటికి, "సార్! సార్! మీదే వూరు?" మాటక దిపాడొకడు నెమ్మదిగా.

మాట్లాడలేదు హెడ్డు.

"మిమ్మల్ని మీ ఊరికి తబాదలా చేయించమంటారాసార్?"

"నువ్వు జేపిస్తావురా? నాకు?"

"అవు సార్!" నాకు హోమ్ మినిస్టర్ తెల్సు సార్!" అన్నాడువాడు

"వామ్మో!...ఎట్ల తెలుసురా?"

"హోమ్మినిస్టర్ డయివరు మా సుట్టమే సార్! వాడు జెప్పిండంటే అయిపోయినట్లే!"

"నాకొద్దు గానీ, మా యస్సైకి చేయించు"

"ఓ, తప్పకుండ గని, మమ్మల్ని ఇడ్సిపెట్టండి!" అన్నాడువాడు.

ఇంతలో- "ట్రింగ్!...ట్రింగ్!...ట్రింగ్!.." మంటూ ఫోన్ మోగింది.

అవతల ఎమ్మెల్యే!...ఇవతల ఎస్సై!

చాలా సేపు మాట్లాడుకున్నారు.

చివరికి "వీలు కాదంటూ" ఫోనుపెట్టేశాడు ఎస్సై.

ఇంతలో కారు వెనక కారు, కారు వెనక కారు ఇలా 'రంయ్' మంటూ కార్లు దూసుకొచ్చాయి పోలీస్ స్టేషన్‌కి. స్వయంగా మినిస్టర్ గారే వచ్చారుయ ఎస్సై అదిరిపడి నిల్చున్నాడు. హెడ్డూ, కానిస్టేబుల్స్ పరుగులు దీశారు. కుర్చీలేసి మినిస్టరు వారినీ, వారి అనుచరగణాన్నీ కూచోబెట్టి సత్కరించారు.

బిచ్చగాండ్ల పోరగాండ్లని అరెస్టు జేస్తే స్వయానా మినిస్టరుగారే రావడమేమిటి? వాళ్ళకేమీ అర్థం గాలేదు. తలలు తిరిగిపోయాయి. కానీ బిచ్చగాండ్లకూ ఓటు ఉంటుందనీ, దాని కెంతో విలువుంటుందనీ పాపం వాళ్ళకు తెలీదు.

"వీళ్ళంతా మన మనుషులే! వెంటనే విడిచిపెట్టండి! వీళ్ళ పూచీ నాది!" అన్నాడు మినిస్టర్.

"మీరు జెప్పినాక విడువమా సార్!" అని మినిస్టర్‌కు నమస్కరించి, "హెడ్డూ! వాళ్ళని వదిలెయ్!" అంటూ ఆర్డరు జారీ చేశాడు ఎస్సై.

అంతా బిలబిలమంటూ బయటపడ్డారు.

"కాంగిరేస్ జిందాబాద్! మినిస్టర్ జిందాబాద్!" అంటూ వాళ్ళంతా నినాదాలు చేశారు.

మినిస్టర్ ఉబ్బిపోయాడు."మీరంతా కల్సి మెల్సుండాలె! బుద్ధి గుండాలె! తన్నుకోవద్దు!" అన్నాడు వాళ్ళతో.

"గట్లనే గాని, మాకు టీవీలు గావాల్నార్!" అన్నారు వాళ్ళు.

"టీవీలా? ఉండండి! మేం అధికారంలోకి రానీ! వాళ్ళు గుడిసె కొకటిస్తే, మేం మనిషికొకటిస్తం! ఫ్రీగ కరెంటు కూడ యిస్తం!"


"మంచిద్దొరా! మా గూడెంల ఓట్లన్నీ మీకే!" అన్నారు వాళ్ళు

మంత్రి ఖుష్షయిండు. ఎస్సై, హెడ్డూ సాల్యూట్ చేసిండ్రు.

మినిస్టరు కారు, కారు వెనక అనుచరుల కార్లు తుర్రుమన్నాయి.

పోరలంతా నినాదాలు చేసుకుంటూ, పక్షుల్లాగా తమ తమ గూళ్ళకు ఎగిరిపోయారు.

## ఫోన్



భర్త: కమలా, గుండె నొప్పిగా వుందని డాక్టర్‌కు ఫోన్ చేయమన్నానే, చేశావా?

కమల: ఆయన ఊళ్లో లేరట... అందుకని ప్లీడర్ గారికి ఫోన్ చేశాను.

## షరతు:

"మీ అమ్మాయి మా వాడికి నచ్చితేనే మీ ఇంట్లో భోజనం చేస్తాం!" మగపెళ్లివారి మాట.

"మా అమ్మాయి మీకు నచ్చిందని చెబితేనే మేం వంట మొదలెడతాం!" అమ్మాయి తండ్రి మాట.